క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత

ధర్మపురి : మండలంలోని నాగారం గ్రామానికి చెందిన తార అనే మహిళకు వైద్య చికిత్స కోసం మంజూరైన రూ.లక్ష విలువైన ఎల్‌వోసీని శనివారం హైదరాబాద్‌లోని తన చాంబర్‌లో రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అందజేశారు. కొంతకాలంగా ఆమె హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అనంతరం మంత్రి ఈశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కవితను కలిసిన పోతారం విండో చైర్మన్



మల్యాల: పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడంపై శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితను మండలంలోని పోతారం పాక్స్ చైర్మన్ అయిల్నేని సాగర్‌రావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలన్నారు.

గణనాథునికి పుష్పార్చన



చిన్నారులతో చైర్మన్ నరేందర్‌రెడ్డి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ పాఠశాలలో గణనాథునికి శనివారం పూజలు నిర్వహించారు. పుష్పార్చన చేసి, 130కి పైగా నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి, వేద పండితులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

కథలాపూర్: మండలంలోని ఇప్పపెల్లి గ్రామ శివారులో గుట్ట ప్రాంతంలోని అటవీభూములను కొందరు అక్రమంగా కబ్జా చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం తహసీల్దార్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని యాదవ, ముదిరాజ్ కులస్తులు గుట్ట ప్రాంతంలో అటవీభూముల్లోని చెట్లను తొలగించి చదును చేస్తున్నారని, అయినా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. ఇక్కడ వివిధ కుల సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడిచెత్తపై అవగాహన

జగిత్యాలరూరల్: మండలంలోని వంజరిపల్లి గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా శనివారం వీధులన్నీ శుభ్రం చేశారు. అనంతరం గ్రామస్తులకు తడి, పొడి చెత్త సేకరణ, ఇళ్లలో నీటి నిలువలు ఉంచుకోకుండా, మురుగుగుంతల్లో దోమలు ఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు.

మళ్లీ రుణసాయం

పెగడపల్లి: మండల సహకార సంఘం ద్వారా ప్రభుత్వం రుణమాఫీ చేసిన రైతులకు మళ్లీ రుణసాయం అందిస్తున్నట్లు సంఘం చైర్మన్ రమణారావు, కేడీసీసీ మేనేజర్ మహిపాల్‌రెడ్డి, సంఘం సీఈవో గోపాల్‌రెడ్డి శనివారం తెలిపారు. పెగడపల్లి సహకార సంఘం నుంచి ఇప్పటివరకు రుణమాఫీ పొందిన 40 మంది రైతులకు రూ.35లక్షల వరకు తిరిగి రుణసాయం అందించినట్లు పేర్కొన్నారు. రైతులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో సంప్రదిస్తే వెంటనే రుణసాయం అందిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

మల్లాపూర్ : మండల కేంద్రంతో పాటు పాత దాంరాజుపల్లి గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పర్యటించనున్నట్లు ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మల్లాపూర్‌లోని కేఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమంలో మల్లాపూర్, కుస్తాపూర్, రత్నాపూర్, గొర్రెపల్లి, వెంపల్లి, వెంకట్రావ్‌పేట గ్రామాల్లో ఆసరా పింఛన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలపారు. పాతదాంరాజుపలిల్లోని రెడ్డీస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే కార్యక్రమంలో ఒబులాపూర్, తండా, సంగెం–శ్రీరాంపూర్, కొత్తదాంరాజుపల్లి, పాతదాంరాజుపల్లి, వాల్గొండ, తండా గ్రామాలవారికి ఆసరా పింఛన్లకార్డులు అందిస్తారని పేర్కొన్నారు.

'బీసీల పదవి వారికే ఇవ్వాలి'

జగిత్యాలరూరల్: బీసీలకు కేటాయించిన పదవులు వారికే ఇవ్వాలని బీసీ సంక్షేమ శాఖ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటి గంగారాం అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీసీలకు కేటాయించిన పదవులను అగ్రవర్ణాలకు కట్టబెట్టి కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ బీసీ మహిళకు ఉండగా.. ప్రస్తుతం ఆ పదవిని ఓసీ అనుభవిస్తున్నారని తెలిపారు.

నాసిరకంగా వంతెన నిర్మాణం

- వర్షానికి తేలుతున్న సిమెంట్, కంకర
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు
- పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కోరుతున్న వాహనదారులు



నాసిరకంగా ఉన్న వంతెన పనులు

రాయికల్: పట్టణం నుంచి రామాజీపేట, మైతాపూర్ గ్రామాలకు వెళ్లే దారిలో నిర్మిస్తున్న వంతెన నిర్మాణాన్ని నాసిరకంగా చేపడుతున్నారు. రెండు గ్రామాలకు వెళ్లే దారిలో కల్వర్టు వద్ద వర్షం కురిసినప్పుడల్లా వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మైతాపూర్ వంతెన నిర్మాణం కోసం రూ.2.91 కోట్లు, రామాజీపేట వంతెనకు రూ.1.40 కోట్ల నిధులు విడుదల చేశారు.

పనుల్లో నాణ్యతా లోపం

రాయికల్ నుంచి మైతాపూర్ వెళ్లే రోడ్డులో రూ.2.91 కోట్లతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో తరుచూ కురుస్తున్న వర్షాలతో నిర్మిస్తున్న వంతెనపై సిమెంట్, కంకర తేలుతుందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సకాలంలో పూర్తి చేయాల్సిన కాంట్రాక్టర్ పూర్తి చేయకపోవడంతో వర్షాలు కురిస్తే వంతెన నుంచి మట్టిరోడ్డు పూర్తిగా బురదమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మైతాపూర్, రామాజీపేట వంతెనలకు ఇరువైపులా పనులు పూర్తికాలేదు. ఇప్పటికైనా వంతెనకు సైడ్ వాల్ నిర్మించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని పట్టణ, మండల ప్రజలు కోరుతున్నారు.

తేలుతున్న కంకర..

మైతాపూర్ వంతెన నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో వర్షాలు కురిసినప్పుడల్లా వంతెన పూర్తిగా తెగిపోవడంతో నిర్మించిన వంతెన నుంచి కంకర తేలుతోంది. అధికారులు పర్యవేక్షించి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మండలంలోని మైతాపూర్, రామాజీపేట గ్రామాల్లో వంతెన నిర్మాణం పూర్తి చేయడంతో పాటు, రోడ్డు నిర్మాణం చేపట్టేలా సంబంధిత కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకువస్తున్నాం. మైతాపూర్ వంతెనపై పనుల్లో నాణ్యత లోపించిందని క్వాలిటీ కంట్రోల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– మధు, ఆర్‌అండ్‌బీ ఏఈ

ప్రత్యేక పూజలు.. నైవేద్యాలు



రాయికల్‌లో : కుంకుమపూజల్లో పాల్గొన్న మహిళలు



వెంకటాపూర్‌లో అన్నదానం చేస్తున్న ఎంపీపీ



జగిత్యాల టౌన్: కోదండరామాలయంలో 108 రకాల నైవేద్యాలు



సారంగాపూర్: రేచపల్లిలో పూజలు చేస్తున్న శ్రావణి

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లి, అల్లీపూర్, ఇటిక్యాల, భూపతిపూర్ తదితర గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణనాథుల వద్ద శనివారం కుంకుమపూజలు నిర్వహించారు. కుమ్మరిపల్లి పద్మశాలీ సేవా సంఘం, రాయికల్‌లోని పలు వినాయకుల వద్ద అన్నదానాలు చేపట్టారు.

కథలాపూర్: కథలాపూర్ మండలం సిరికొండలో శ్రీరాం యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద భక్తులు 108 రకాల నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు వివిధ రకాల పిండి వంటకాలు తయారుచేసి వినాయకుడికి సమర్పించి పూజలు చేశారు.

దుబ్బరాజన్న ఆలయంలో..

సారంగాపూర్: దుబ్బరాజన్న ఆలయంలో ప్రతిష్ఠించిన వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని రేచపల్లి, అర్పపల్లి గ్రామాల్లోని వినాయకుల మండపాల్లో జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపు శ్రీకోదండ రామాలయంలో శనివారం 108భోగాలతో స్వామివారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కోరుట్ల, కోరుట్ల రూరల్ : పట్టణంతో పాటు మండలంలో వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అంబేద్కర్ నగర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథునికి సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై కిరణ్ కుమార్ పూజలు నిర్వహించారు. వెంకటాపూర్‌లో సింహ గర్జన యూత్ గణపతి మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీపీ తోట నారాయణ ప్రారంభించారు. భగత్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకునికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సరభి నవీన్ కుమార్ పూజలు చేసి అన్నదానం ప్రారంభించారు. కౌన్సిలర్ గణేశ్, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి : మండలంలోని నేరెల్లలో ఈగల్ యూత్ ఆధ్వర్యంలో ఊడల ఊయలలో విఘ్నేశ్వరున్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శనివారం మండపం వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జాజాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వెల్గటూర్: మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుడికి 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. స్తంభంపల్లిలో మహిళలు కుంకుమ పూజలు చేశారు.

మెట్‌పల్లి: పట్టణంలో వినాయక నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా స్థానిక వాసవీ ఆలయంలో వినాయకునికి చెక్కెరాభిషేకం చేశారు. పలు మండపాల వద్ద అన్నదానం నిర్వహించారు.

నగదు అందజేత



నగదు అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

వెల్గటూర్: ఇటీవల కొత్తపేటలో ప్రజా ఆశీర్వాద యాత్ర సందర్భంగా మంత్రి ఈశ్వర్ పర్యటించగా కొత్తపేట ఎస్సీ కాలనీవాసులు ఈ సంవత్సరం వినాయకుడి విగ్రహం అందించాలని మంత్రిని కోరారు. ఈ మేరకు శనివారం రోజు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఏఎంసీ డైరెక్టర్ జీరెడ్డి మహేందర్‌రెడ్డికి విగ్రహానికి అయిన రూ.11, 600 పంపించగా అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కుషనపల్లి రాజయ్య సమక్షంలో ఎస్సీ కాలనీ వినాయక మండప కమిటీ సభ్యులకు అందజేశారు. కమిటీ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

దిష్టిబొమ్మ దహనం

జగిత్యాలటౌన్: చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ బిల్లు అగ్రవర్ణ మహిళల రిజర్వేషన్ బిల్లుగా అభివర్ణిస్తూ జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో శనివారం 33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు దిష్టిబొమ్మను ధర్మ సమాజ్ పార్టీ (డిఎస్పీ) నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 33శాతం మహిళా రిజర్వేషన్‌లో 90శాతం ఉపకోట కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ధర్నా చేపడతామని హెచ్చరించారు. బిల్లుకు మద్దతు పలుకుతున్న బీఆర్‌ఎస్, ఇండియా కూటమి పార్టీల దిష్టిబొమ్మలను సైతం దహనం చేస్తామని తెలిపారు. ముసిపట్ల లక్ష్మీనారాయణ, వనజ, గంగ, మైథిలీ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కథలాపూర్: మండలకేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ముస్కరి కిరణ్‌ను పార్టీ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు శనివారం పరామర్శించారు. కిరణ్ కూతురు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ బీఆర్‌ఎస్ మండల నాయకులు మామిడిపెల్లి రవి, దొప్పల జలందర్, పిడుగు తిరుపతి రెడ్డి, ముంజ దశాగౌడ్, ఎండీ ముజీబ్ ఉన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

కథలాపూర్: మండలంలోని కలిగోటలో పలు అభివృద్ధి పనులకు ఎంపీపీ జవ్వాజి రేవతి శనివారం భూమిపూజ చేశారు. బతుకమ్మ ఘాట్ నిర్మాణానికి రూ. 2లక్షలు, హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు రూ.1.25 లక్షలు మండల పరిషత్ నిధులు కేటాయించినట్లు ఆమె పేర్కొన్నారు. పనులు సకాలంలో పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, సర్పంచ్ ధరావత్ సరోజ, ఎంపీటీసీ గంగం దేవేంద్ర, ఉపసర్పంచ్ మార్కం రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

మెట్‌పల్లిరూరల్: మండలంలోని వెల్లుల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి ఓటుహక్కు ప్రాముఖ్యత, ఆవశ్యకత గురించి వివరించారు.

అలరించిన స్వాగతోత్సవం

కోరుట్ల : పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో స్వాగతోత్సవం అలరించింది. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, కరస్పాండెంట్ యాద రామకృష్ణ, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు అధ్యాపకులు పాల్గొన్నారు.

'నలంద'లో ఫ్రెషర్స్ డే హంగామా



జగిత్యాల: జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్ మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెరువులో రొయ్య పిల్లలు విడుదల



రొయ్య పిల్లలను వదులుతున్న డీఎఫ్‌వో దామోదర్

వెల్గటూర్: మండలంలోని స్తంభంపల్లి చెరువులో శనివారం డీఎఫ్‌వో దామోదర్ ఆధ్వర్యంలో లక్ష రొయ్య పిల్లలను వదిలారు. సమీకృత మత్స్య అభివృద్ధి పథకంలో భాగంగా జిల్లాలోని 16 చెరువుల్లో 20 లక్షల రొయ్య పిల్లలను వదిలేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మత్స్యకారులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు నాగుల రమేశ్, ప్రధాన కార్యదర్శి గుమ్ముల శంకరయ్య, డైరెక్టర్లు నాగుల రమేశ్, ఉశయ్య, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మెప్పు కోసమే శ్రావణిపై విమర్శలు

జగిత్యాలటౌన్: మాజీ మున్సిపల్ చైర్మన్ భోగ శ్రావణిపై అనవసరపు విమర్శలు చేస్తే సహించేది లేదని బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబారి కళావతి హెచ్చరించారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌గా ఉన్న అడువాల జ్యోతి ఎమ్మెల్యే మెప్పు కోసం శ్రావణిపై విషం చిమ్మడం మానుకోవాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో జ్యోతికి టికెట్ రావడానికి, గెలుపొందడానికి ప్రధాన కారణం భోగ శ్రావణి అనే విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. మహిళా మోర్చా నాయకురాలు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మెట్‌పల్లి, జగిత్యాల మహిళా డిగ్రీ కళాశాలలో 2023–24 సంవత్సరానికి గాను పార్ట్‌టైం బేసిక్‌లో అసిస్టెంట్ కేర్ టేకర్‌గా పనిచేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా పేర్కొన్నారు. ఈనెల 30లోపు ధ్రువీకరణ పత్రాలతో మేడిపల్లి గురుకులలో అందించాలన్నారు. వచ్చేనెల 3న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గుంటన్నర భూమి విరాళం

కథలాపూర్: మండలంలోని సిరికొండలో సహకార సంఘం గోదాం కోసం నాయకులు ముదాం రవి, రిక్కల అనంతరెడ్డి గుంటన్నర భూమి విరాళంగా ఇచ్చినట్లు చైర్మన్ చుక్క దేవరాజం శనివారం తెలిపారు. గోదాం నిర్మాణానికి కోసం భూమి విరాళంగా ఇవ్వడం అభినందనీయమన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



వెల్గటూర్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని స్తంభంపల్లి జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జక్కని రాజేశం అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల అండర్ 17 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నీకాయిట్, చెస్, క్యారమ్స్, అథ్లెటిక్స్ విభాగాల్లో క్రీడాపోటీలు నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



బాండ్ అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: అన్నివర్గాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని ప్రతిపక్షాల అసత్య ఆరోపణలు నమ్మవద్దని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రానికి చెందిన గోగికార్ బాబురావు విద్యుదాఘాతంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి రూ.5 లక్షల బాండ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ... సీఎం కేసీఆర్ అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఇక్కడ మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కప్పల శ్రీకాంత్, శివకేసరి బాబు, జగదీశ్, రాజేశ్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించాలి



రాయికల్ : బతుకమ్మ ఆడుతున్న అంగన్‌వాడీలు



కోరుట్ల: సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు

ధర్మపురి : మండలంలోని పలు గ్రామాలకు చెందిన అంగన్‌వాడీలు తహసీల్దార్ కార్యాలయం ముందు చేస్తున్న సమ్మెకు బీఎస్పీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క విజయ్‌కుమార్ మాట్లాడుతూ .. అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రతతో పాటు పర్మినెంటు చేయాలన్నారు.

పెగడపల్లి: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన అంగన్‌వాడీల సమ్మె 13వ రోజు శనివారం కొనసాగింది. అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వం చర్చలు జరిపి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జయప్రద, భాగ్యమణి, మంగ, రత్నమాల, సౌజన్య, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మిట్టపల్లి పద్మ, రోజా, లావణ్య, రమాదేవి, ఉమాదేవి, రాజేశ్వరి, గోదావరి, బుజ్జమ్మ పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె కొనసాగింది. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని అంగన్‌వాడీ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు.

వెల్గటూర్: తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వెల్గటూర్ అంగన్‌వాడీ టీచర్ల సంఘం మండల అధ్యక్షురాలు శంకరమ్మ అన్నారు. రెండ్రోజులుగా నిరాహార దీక్ష చేపట్టినట్లు తెలిపారు.

మల్యాల: మండలకేంద్రంలో అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు వీరబత్తిని శోభారాణి సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి, కంచర్ల లక్ష్మణాచారి, వీరబత్తిని పృథ్వీరాజ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఉన్నారు.

అన్నిరంగాల్లో రాష్ట్రాభివృద్ధి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్‌కుమార్

మల్లాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని వెంకట్రావ్‌పేటలో పర్యటించారు. వాల్మీకీ గణేశ్ మండపంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమల్లో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. బీఆర్‌ఎస్‌ను ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

పరామర్శ

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వెంకట్రావ్‌పేట సర్పంచ్ భర్త జోగుల రాజేశ్‌ను పరామర్శించారు. ఎంపీపీ కాటిపెల్లి సరోజన ఆదిరెడ్డి, రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, ఎంపీటీసీ సుజాత, ఉపసర్పంచ్ రవి, గంగగౌరీశ్వర ఆలయ కమిటీ చైర్మన్ ఎలాల కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, నాయకులు యాదగిరి నర్సింగరావు, శ్రీనివాస్, చంద్రశేఖర్, దశరెడ్డి, జీవన్‌రెడ్డి, ఆరె పెద్దిరెడ్డి, బిట్ల నరేష్, న్యామతాబాద్ రాజు, రాజేందర్ తదితరులున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

జగిత్యాల: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ అనిల్‌బాబు అన్నారు. శనివారం స్థానిక ఓల్డ్ హైస్కూల్‌లో స్వచ్ఛత ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్లాస్టిక్‌ను వినియోగించవద్దన్నారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ చందు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మల్లాపూర్ : స్వచ్ఛభారత్ స్ఫూర్తితో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో జగదీశ్ అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలతో కలిసి స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మల్లాపూర్ మేజర్ గ్రామ పంచాయతీ ఈవో భూమేశ్వర్, సీనియర్ నాయకులు కాటిపెల్లి ఆదిరెడ్డి, అధికారులు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులపై ఆరోపణలు మానుకోవాలి

ధర్మపురి (బుగ్గారం): బీఆర్‌ఎస్ నాయకులపై ఆరోపణలు మానుకోవాలని వైస్ ఎంపీపీ సుచేందర్, ఎస్సీసెల్ అధ్యక్షుడు నక్క జితేందర్ హితవు పలికారు. మండలకేంద్రంలో ఇటీవల జరిగిన ఓ అన్నదమ్ముల గొడవ విషయంలో నిజాలు తెలుసుకోకుండా దళిత లిబరేషన్ ఫ్రంట్ ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్ బీఆర్‌ఎస్ నాయకులపై చేసిన ఆరోపణలను ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. మండలకేంద్రంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, జెడ్పీటీసీ బాదినేని రాజేందర్‌పై ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అన్నదమ్ములకు జరిగిన గొడవ విషయంలో ఓ వ్యక్తికి వత్తాసు పలకడం సరికాదన్నారు. అభివృద్ధిపై ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలని సవాల్ విసిరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండలశాఖ ఉపాధ్యక్షుడు గాలిపెల్లి మహేశ్, ఉప సర్పంచ్ రామకృష్ణ, గంగ శ్రీనివాస్, తదితరులున్నారు.

శ్మశానవాటిక వరకు రోడ్డు నిర్మించాలి

మల్లాపూర్ : శ్మశానవాటికను నిర్మించి వెళ్లేందుకు రహదారి నిర్మాణం చేపట్టకపోవడంతో మండలంలోని చిట్టాపూర్ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ ఐటీ సెల్ జిల్లా కోర్ కమిటీ మెంబర్ అంజిరాజ్ దండుగుల అన్నారు. శనివారం చిట్టాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో నిర్మించిన శ్మశాన వాటికు రోడ్డులేకపోవడంతో గ్రామంలో ఎవరైనా చనిపోతే సమీపంలోని పెద్దవాగులో దహన సంస్కారాలు చేయాల్సి వస్తోందని తెలిపారు. పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కలెక్టర్‌కి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా అధికారులు విచారణ చేపట్టి సమస్యను పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు శ్మశాన వాటిక వరకు రోడ్డు నిర్మించి వినియోగంలోకి తీసుకురావాలని, లేకపోతే గ్రామస్తులతో కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.